సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం ౹ 25 ౹ సెప్టెంబర్ ౹ 2024



రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండల పరిధిలోని పందిళ్లపల్లె వద్ద ఉన్న భైరవేశ్వర స్వామి ఆలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. -8లో



హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవం

ఆస్తి, వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో తండ్రిని హత్య చేశారు. ఈ ఘటనలో ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. -8లో

గరిష్టం/కనిష్టం
33.0/24.8

వాతావరణం

జిల్లాలో మంగళవారం 24.8 – 33.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'ఉత్తమ ఉపాధ్యాయ విశిష్టత' పురస్కారం ప్రదానం



డా. కె.ఎస్.వి. కృష్ణారావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు 'ఉత్తమ ఉపాధ్యాయ విశిష్ట ప్రతిభా పురస్కారం –2024' అందుకున్నారు. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారం ట్రస్ట్ చైర్మన్, విశ్రాంత డీజీపీ డాక్టర్ పూర్ణచంద్రరావు, ఇ. వీరయ్య అందజేశారు. విద్యా, పరిశోధనా రంగాలలో కృష్ణరావు చేసిన సేవలు, కృషి పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారం ప్రదానము చేశారు. ఆచార్య కృష్ణారావు విశ్వవిద్యాలయంలో 'పాలిమర్ బయోమెటీ డిజైన్ అండ్ సింథసిస్' పరిశోధన బృందానికి నాయకత్వం వహిస్తున్నారు.

జేఎన్‌టీయూలో బీటెక్ ఫలితాలు విడుదల



జేఎన్‌టీయూ బీటెక్ ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ అరుణ కాంతి, వైస్ ప్రిన్సిపల్

పులివెందుల రూరల్: పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో ఆగస్టు/సెప్టెంబర్ –2024 నెలలో నిర్వహించిన బీటెక్ రెండవ సంవత్సరం రెండవ సెమిస్టర్, మూడవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్ 20)రెగ్యులర్ ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఈ.అరుణ కాంతి, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జీ.వి.సుబ్బారెడ్డి తెలిపారు. పరీక్షా ఫలితాలను కళాశాలల వెబ్ సైట్‌లో పొందుపరిచామని, విద్యార్థులు వెబ్ సైట్‌లో పరీక్షా ఫలితాలు తెలుసుకోవచ్చునన్నారు.

ఏఎఫ్‌యూ పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఏఎఫ్‌యూ అధికారులు

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌కు సంబంధించిన 1వ సెమిస్టర్ నుంచి 8వ సెమిస్టర్ వరకు ఇన్‌స్టంట్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ఎస్.రాజేష్ కుమార్ రెడ్డి విడుదల చేశారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో పరీక్ష విభాగంతో కలిసి ఫలితాలను విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. కార్యక్రమంలో అదనపు పరీక్షా నియంత్రణ అధికారి డాక్టర్ ఫణీంద్ర రెడ్డి, ఉదయ ప్రకాష్ రెడ్డి, లక్ష్మీ ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి స్టీల్‌ప్లాంట్ పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు: వచ్చే సంక్రాంతి పండుగకు కన్యతీర్థం వద్ద జేఎస్‌డబ్ల్యూ యాజమాన్యం స్టీల్‌ప్లాంట్ పనులను ప్రారంభించబోతోందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మోరగుడి గ్రామంలో మంగళవారం ఆయన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటయితే స్థానిక ప్రజలకు ఉద్యోగావకాశాలు మెరుగవుతాయన్నారు. అంతేకాకుండా మైలవరం మండలంలోని దాల్మియా సిమెంట్ నుంచి పైప్రాంతంలో రైతులకు కోరినంత పరిహారం ఇప్పించామని, ఈ ప్రాంతంలో అదాని గ్రూపు పదివేల కోట్లతో సిమెంట్ ఫ్యాక్టరీ కూడా రాబోతోందన్నారు. సోలార్ ప్రాజెక్టు సైతం మన ప్రాంతానికి రాబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, సర్పంచ్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కడపపై ఎందుకీ వివక్ష!

- కొప్పర్తిలోని టెక్నాలజీ సెంటర్ అమరావతికి తరలింపు
- బాబు హయాంలో మళ్లీ మొదలైన తరలింపు వ్యవహారం
- 2014–19 మధ్య ఉర్దూ యూనివర్శిటీ కర్నూలుకు తరలింపు
- ఆది నుంచి అంతే.... 2024లో సీట్లిచ్చినా మారని సీన్
- ప్రస్తుతం సెంటర్ తరలింపునకు జీఓ నం.56 జారీ



కొప్పర్తి పారిశ్రామికవాడ

సాక్షి కడప /సెవెన్‌రోడ్స్: ఆది నుంచి అంతే... చంద్రబాబు తీరులో ఏమాత్రం మార్పు లేదు. అంతకుమునుపు ఓట్లు, సీట్లు అంటూ కడపకు ఏమీ చేయని సీఎం ప్రస్తుతం ఇక్కడ ఉన్న వాటికి ఎగనామం పెడుతున్నారు. రాజకీయ కక్షలో భాగంగా కడపకు కడుపు మంట మిగుల్చుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఏదో ఒక రకంగా కడపపై వివక్ష చూపుతూ వస్తున్నారు. ఈసారి 2024 ఎన్నికల్లో కడప నుంచి సీట్లు ఇచ్చినా కక్ష మాత్రం వీడలేదు. పులివెందుల మెడికల్ కళాశాల ప్రవేశాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు మోకాలొడ్డిన సంఘటన జిల్లా ప్రజలు మరువకముందే తాజాగా ఆయన మరో భారీ షాక్ ఇచ్చారు. భారత ప్రభుత్వం గతంలో కొప్పర్తి మెగా ఇండస్ట్రీయల్ హబ్‌కు మంజూరు చేసిన రెండవ ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని అమరావతికి తరలించారు. అన్నిరంగాల్లో వెనుకబడిన జిల్లాను సమగ్రాభివృద్ధి చేయాల్సిందిపోయి అంతో ఇంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఇలాంటి పరిశ్రమలను కూడా అభివృద్ధి చెందిన ప్రాంతానికి తరలించుకుపోవడంపై జిల్లా ప్రజలు మండిపడుతున్నారు.

గతంలో ఉర్దూ యూనివర్శిటీకి మంగళం

సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో అధిక శాసనసభ స్థానాలను టీడీపీకి కట్టబెట్టినా ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాకు ద్రోహం చేస్తూ మళ్లీ తరలింపుల పర్వానికి తెరలేపారు. అంతకుముందు 2014–19 మధ్య కాలంలో కడపకు వచ్చిన ఉర్దూ యూనివర్శిటీని కర్నూలుకు తరలించిన బాబు సర్కార్, ఇప్పుడు టెక్నాలజీ సంస్థను ఎగరేసుకుని పోయారు. గతంలో నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు భారత ప్రభుత్వం గుంటూరులో టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు అనుమతించింది. ఇందుకు అవసరమైన భూమి అందుబాటులో ఉండాలి. అయితే గుర్తించిన భూమి నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకానికి అవసరం కావడంతో టెక్నాలజీ సెంటర్‌కు తగిన భూమి అందుబాటులో లేదంటూ ఆనాటి గుంటూరు జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి స్పష్టం చేశారు. దీంతో నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెండవ ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను కడపలోని కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖకు ప్రతిపాదనలు పంపారు. దీంతో భారత ప్రభుత్వం రూ. 250 కోట్ల అంచనా వ్యయంతో టెక్నాలజీ సెంటర్‌ను కొప్పర్తి మెగా ఇండస్ట్రీయల్ హబ్‌కు మంజూరు చేసింది. కొప్పర్తిలోని నార్త్ బ్లాక్‌లో 19.5 ఎకరాల విస్తీర్ణంలో ఉచిత లీజు ప్రాతిపదికన ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. టెక్నాలజీ సెంటర్ కార్యరూపం దాల్చి ఉంటే పలువురికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించి ఉండేవి.

అమరావతికి తరలిస్తూ జీఓ జారీ

జిల్లాలోని కొప్పర్తిలోగల టెక్నాలజీ సెంటర్ అమరావతికి తరలిస్తూ బాబు సర్కార్ మంగళవారం జీఓ నెం. 56ను జారీ చేసింది. కడపకు మంజూరైన ప్రాజెక్టు తరలింపుపై అన్ని వర్గాల ప్రజలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ప్రతిసారి రాజకీయ దెబ్బతో జిల్లా ప్రజలకు తీరని అన్యాయం జరుగుతోంది.

కడపకు తీరని అన్యాయం



టెక్నాలజీ సెంటర్ తరలింపుతో జిల్లాకు తీరని అన్యాయం జరిగింది. జిల్లాకు చెందిన నిరుద్యోగులకు కొంతమేర అవకాశాలు ఉండేవి. వైఎస్సార్ సీపీ హయాంలో గుంటూరులో భూమి అవకాశం లేకపోవడంతో అప్పటి సీఎం వైఎస్ జగన్ కొప్పర్తిలో టెక్నాలజీ సెంటర్‌కు భూమి ఇవ్వడంతోపాటు సౌకర్యాలు కల్పించడంతోఈ ప్రాంతానికి మంజూరైంది. అంతర్జాతీయ ఇంజనీరింగ్ ప్రమాణాలు, స్కిల్ నైపుణ్యాలలో శిక్షణ కల్పించేందుకు తీసుకొచ్చిన టెక్నాలజీ సెంటర్ తరలిస్తూ జీఓ ఇవ్వడం అన్యాయం.
– రాజోలి వీరారెడ్డి, రాష్ట్ర పరిశ్రమలశాఖ మాజీ సలహాదారు, కడప

జగన్ పరిశ్రమలు తెస్తే...బాబు తరలిస్తున్నారు



వైఎస్సార్ హయాంలో కొప్పర్తికి భూమి కేటాయింపుతోపాటు పరిశ్రమలను తీసుకొచ్చేందుకు అభివృద్ధి చేశారు. తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కొప్పర్తికి అనేక పరిశ్రమలు తీసుకొచ్చారు. ప్రధానంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు వెళ్లింది. అయితే ఇప్పుడు రాజకీయాల కోసం బాబు అధికారంలోకి రాగానే ఇక్కడి సంస్థలను కూడా అమరావతికి తరలిస్తున్నారు. ఇది కడపజిల్లా ప్రజలపై మంటతోనే బాబు ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారు. – పి.రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, కడప

ఉపాధి అవకాశాలు దెబ్బతీయడమే..



కొప్పర్తి సెజ్‌లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను జీఓ నెం.56 ప్రకారం అమరావతికి తరలించడం వైఎస్సార్ జిల్లా యువత, నిరుద్యోగుల ఉపాధి అవకాశాలను విచ్ఛిన్నం చేయడమే. ఇటీవల పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్లు వద్దని లేఖ రాసిన ముఖ్యమంత్రి చంద్రబాబు అంతలోనే కొప్పర్తి టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించేందుకు జీఓ జారీ చేయడం యువత ఆశలపై నీళ్లు చల్లడమే అవుతుంది.
–రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత

రాజా ఫౌండేషన్ వివాదంపై ఆర్డీఓ విచారణ



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు కల్చరల్: డాడీహోం, రాజాఫౌండేషన్ ట్రస్ట్‌లో నెలకొన్న వివాదంపై కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనివాసులు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని, రాజా ఫౌండేషన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పాతకమిటీ నిర్వాహకులు మైలవరం డాడీహోంలో ఉన్న బీఈడీ కళాశాల రెన్యూవల్ కోసం అవసరమైన డాక్యుమెంట్లు కొత్త కమిటీ నిర్వాహకుల వద్ద ఉన్నాయని వాటిని ఇప్పించాలని కోరారన్నారు. అలాగే డాడీ హోం, పూజా స్కూల్, కిడ్స్ స్కూల్‌లలో సిబ్బంది వేతనాలు, నిర్వహణ సమస్యలపై ఇరువర్గాలతో చర్చిస్తామని తెలిపారు. కొత్త కమిటీ నిర్వాహకులు విచారణకు గైర్హాజరయ్యారని వారిని కూడా విచారిస్తామని తెలిపారు. ఆ తరువాత కలెక్టర్‌కు ఒక నివేదిక అందజేస్తామన్నారు. డాడీహోంకు ప్రభుత్వం 40 ఎకరాలు ఇచ్చిందని అందువల్ల ఈ వివాదంపై ప్రభుత్వం జోక్యం చేసుకుని విచారణ చేస్తుందని స్పష్టం చేశారు. విచారణలో సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, కో ఆపరేటివ్ ఆఫీసర్ సుభాషిణి, తహసీల్దార్ గంగయ్య, ఎంఈఓ సావిత్రమ్మ పాల్గొన్నారు. ఈ విచారణకు రాజా ఫౌండేషన్ పాతకమిటీ చైర్‌పర్సన్ రాధ, సీఈఓ కవిత తదితరులు హాజరై తమ ఇబ్బందులను తెలిపి రాత పూర్వకంగా ఆధారాలను అందించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ బాల మద్దిలేటి, త్రీటౌన్ ఎస్ఐ యోగేంద్ర పాల్గొన్నారు.



చెరువును తలపిస్తున్న కడప ఆర్టీసీ బస్టాండ్

జిల్లాలో వర్షం

- పెండ్లిమర్రిలో అత్యధికంగా 73.4 మి.మీ వర్షం

కడప అగ్రికల్చర్: అల్పపీడన ప్రభావంతో జిల్లాలో రెండు రోజుల నుంచి వర్షం కురుస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం తెల్లవారుజామున జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం దంచి కొట్టింది. పెండ్లిమర్రిలో అత్యధికంగా 73.4 మి.మీ వర్షం కురిసింది. అలాగే జమ్మలమడుగులో 50.5, సికెదిన్నెలో 48.4, కడపలో 43.2, సిద్ధవటంలో 35.2, అట్లూరులో 28.2 , మైలవరంలో 25.4 , ఒంటిమిట్టలో 23.8 , పొద్దుటూరులో 16.6 , మైదుకూరులో 12.4 , ఖాజీపేటలో 11.8 , చెన్నూరులో 11.2 , చాపాడు, వల్లూరులో 9.6 , గోపవరంలో 9, వీఎన్‌పల్లిలో 8.4, పెద్దముడియంలో 7.8, బద్వేల్‌లో 7.2 , దువ్వూరులో 5.8 , బి.మఠంలో 5.2 , వేములలో 3 ,సింహాద్రిపురంలో 2.6, కమలాపురంలో 2.4, రాజుపాలెంలో 2, పోరుమామిళ్లలో 1.8, బి.కోడూరులో 1.6 మి.మీ వర్షం కురిసింది.

మాతృ మరణాలు లేని జిల్లాగా మారుద్దాం

- గర్భిణీలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ శివశంకర్ లోతేటి



సమావేశంలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: ఏ తల్లీ జన్మనిస్తూ మరణించకూడదని....ఏ శిశువు జన్మిస్తూ మరణించకూడదని, గర్భిణీలపై ప్రత్యేక పర్యవేక్షణ వహిస్తూ ప్రసూతి సమయంలో మాతృ, శిశువు మరణాలను అరికట్టాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ప్రజా వినతుల వేదిక హాలులో జిల్లా స్థాయి ప్రసూతి మరణాల విచారణ కమిటీ సమావేశం కలెక్టర్ శివశంకర్ లోతేటి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో ప్రసూతి మరణాల రేటును జీరో శాతానికి తీసుకువచ్చేందుకు వైద్యాధికారులు, అంగన్వాడీ, ఆరోగ్యకార్యకర్తలు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా, అంకిత భావంతో పని చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో 2023–24 సంవత్సరంలో సంభవించిన ప్రసూతి మరణాలకు సంబంధించి.. బాధిత కుటుంబ సభ్యులు, సంబంధిత పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల వైద్యాధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లతో విచారణ నిర్వహించారు. మాతృ మరణాలకు సంఘటనల వివరాలను, కారణాలకు తెలుసుకున్నారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో వైద్యాధికారులు క్రమం తప్పకుండా వారి పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో నమోదయిన గర్భిణులు, బాలింతల వివరాలను తెలుసుకోవాలన్నారు. వైఎస్ఆర్ జిల్లాను మాతృ మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. డీడీపీవోలు తరచూ తప్పకుండా సూపర్వైజర్‌లతో అలాగే పీడీ సీడీపీవోలతో సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. ప్రతివారం జిల్లా స్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహించుకోవడం, తద్వారా ఐసీడీఎస్ ప్రాజెక్టులలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ, అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, సంబందిత వైద్యాధికారులు, అంగన్వాడీ సూపవైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మయూరం.. నయన మనోహరం



ఘాట్‌రోడ్డు గోడపై వెళ్తున్న నెమళ్లు

అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై మంగళవారం తెల్లవారుజాము నెమళ్ల గుంపు సందర్శకులను కనువిందు చేసింది. కొండపైకి వెళ్తున్న సందర్శకులకు ఘాట్‌రోడ్డు రక్షితగోడ్డపై ఒకదానివెంట ఒకటి ఐదు నెమళ్లు వెళ్తూ కనిపించాయి. నిశ్శబ్దంగా ఉన్న వాతావరణం నెమళ్ల కూతలతో సందర్శకులు అనుభూతి పొందారు. వాతావరణం చల్లగా మారి మేఘాలు కొండను కమ్మేయడంతో వన్యప్రాణులు రోడ్లపైకి వస్తున్నాయి.
– బి.కొత్తకోట

నూతన ఏసీగా మల్లికార్జున ప్రసాద్



నూతన ఏసీ మల్లికార్జునప్రసాద్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

కడప కల్చరల్: జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా మల్లికార్జున ప్రసాద్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఆయన కడప నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏసీగా బాధ్యతలు చేపట్టారు. దేవదాయశాఖ అర్చక బృందం ఈ సందర్భంగా ఆయనకు వేదాశీస్సులు అందజేశారు. మల్లికార్జునప్రసాద్ ఇంతకుముందు కూడా జిల్లాలో అసిస్టెంట్ కమిషనర్‌గా సేవలు అందించారు. ప్రస్తుతం అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీని బదిలీ చేశారు.

అమ్మా.. ఆకలి!

'అమ్మా... ఆకలేస్తోంద'ని
ఎన్నిసార్లు అడిగారో...ఎంతలా అలిసిపోయారో..
అమ్మ తినిపించే గోరు ముద్ద కోసం
ఎంతగా తపించిపోయారో... తల్లడిల్లిపోయారో..
అన్నం ముద్ద దొరక్క.. ఆకలి తీరక
ఊపిరొదిలిన ఆ పాపలకే తెలుసు..
పిల్లల ఆకలి తీర్చడం కోసం.. ఎన్ని గడపలు
తొక్కారో.. కన్నబిడ్డలు దూరమై..
ఎంత వేదన అనుభవిస్తున్నారో...
బిడ్డలను కోల్పోయిన ఆ తల్లిదండ్రులకే తెలుసు..
నింగిలోకి రాకెట్లు దూసుకుపోతున్న యుగం
లోనూ ఆకలిచావులు పలకరిస్తున్నాయి.
పౌష్టికాహారం దొరక్క అర్ధంతరంగా ఆగిన
ఈ రెండు నిండు ప్రాణాలు.. పాలకుల తీరును
ప్రశ్నిస్తున్నాయి. సమాజంలోని అంతరాలకు
అద్దం పడుతున్నాయి. జానెడు పొట్టకు గుక్కెడు
పాలు అందించని అధికారుల అలసత్వాన్ని
ఎక్కిరిస్తున్నాయి. ఆకలైనప్పుడు పిడికెడు అన్నం
దొరకనప్పుడు.... జీవించడానికి అవసరమైన
భరోసా ఇవ్వనప్పుడు.. కోట్ల రూపాయల బడ్జెట్లు
ఎందుకంటూ హేళనగా నవ్వుతున్నాయి.

మృత్యు కౌగిలికి చేరిన ఇద్దరు చిన్నారులు



చనిపోయిన ఇద్దరు పిల్లల వద్ద వైద్య బృందం

సిద్దవటం: పౌష్టికాహార లోపంతో ఇద్దరు చిన్నారులు చని పోయిన సంఘటన అన్నమయ్య జిల్లా సిద్దవటం మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. సిద్దవటం మండలంలోని బొగ్గిడివారంపల్లె పంచాయతీ నిర్మలగిరి కాలనీ వద్ద ఖాళీ ప్రదేశంలో సంచార జీవనం చేసేవారు గుడారం వేసుకుని ఉంటున్నారు. ఈ గుడారంలో నివాసం ఉంటున్న 5 సంవత్సరాలు, 2 సంవత్సరాల వయస్సుగల బాలికలకు ఇద్దరికి అస్వస్థతగా ఉందని పడుకొని ఉన్నా రు. పిలిస్తే పలకడం లేదని, రాత్రి నుంచి ఇరువురికి జ్వరం వస్తోందని, వారి గుడిసెలో ఉన్న పెద్దఅమ్మాయి సమీపంలోని గ్రామస్తులకు తెలిపింది. గ్రామస్తులతో విషయం తెలుసుకున్న బొగ్గిడివారిపల్లె గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న ఏఎన్ఎం, ఆశా వర్కర్‌లు, 104 సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలించారు. అప్పటికే ఇద్దరు బాలికలు మరణించి ఉన్నారు. వారికి శరీరం పైన ఎలాంటి గాయాలు, విషపురుగులు కుట్టినట్లు గాని లేవన్నారు. కాగా చనిపోయిన పిల్లల తల్లిదండ్రులు సంచార జీవనం చేస్తున్నారు. వీరికి ఆరుగురు పిల్లలు. మంగళవారం చివరి ఇద్దరు పిల్లలు చనిపోయారు. వీరు ఈ ప్రాంతానికి వచ్చి సుమారు 10 రోజులు కావొస్తోందని, పిల్లలు ఇద్దరు చనిపోయినప్పుడు వీరి తల్లి దండ్రులు ప్లాస్టిక్ వస్తువులు ఏరుకునేందుకు, భిక్షాటన కోసం మాధవరం గ్రామంలోకి వెళ్లారు. కాగా.. ఇద్దరు చిన్నారుల మృతి వార్త తెలుసుకుని తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు వేదన చెందారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని అప్పాయపల్లె గాంధీ నగర్‌కు చెందిన ఇరుగుడి చిన్నబాబు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లిక్కర్‌లో పురుగుల మందు కలుపుకుని తాగాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ముద్దనూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజ (41) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు సింహాద్రిపురం మండలం కోవరగుంటపల్లె గ్రామానికి చెందిన రాజ కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 17వ తేదీ అతను తన అన్న, మరో ఇద్దరితో కలిసి ఆటో బాడుగకు తీసుకుని చిలంకూరు అంజనేయస్వామి గుడికు వెళ్తున్నారు. మండలంలోని పెద్ద దుద్యాల గ్రామం వద్దకు రాగానే పంది అడ్డం రావడంతో ఆటో డ్రైవరు వేగం అదుపుచేసుకోలేక ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో రాజకు తీవ్ర గాయాలుకాగా డ్రైవరుతో సహా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కర్నూలులో చికిత్స పొందుతూ రాజా మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ..

అట్లూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన శిగే చెన్నకేశయ్య(58) అనే వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు మృతుని బంధువులు తెలిపారు. రెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన చెన్నకేశయ్య శనివారం తెలిసిన వ్యక్తి ద్విచక్ర వాహనంలో వెనుకవైపు కూర్చుని అట్లూరు వైపు వెళుతుండగా వెనుక వైపు నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన చెన్నకేశయ్య తిరుపతిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం



కడప అర్బన్ : కడప రిమ్స్ మార్చురీలో ఈనెల 22 నుంచి గుర్తు తెలియని వృద్ధురాలు (75) మృతదేహం ఉంది. ఈమెను ఈనెల 11న వీరపునాయునిపల్లె మండలం తంగేడుపల్లికి చెందిన లక్షుమ్మ అనే చిరునామాతో చేర్పించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆమె ఈనెల 22న మృతి చెందింది. ఎవరైనా ఆమెకు సంబంధించిన వారు తగిన ఆధారాలతో సంప్రదించాలని రిమ్స్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రహదారులు రక్తసిక్తం

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

కమలాపురం : జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండల పరిధిలోని పందిళ్లపల్లె వద్ద ఉన్న భైరవేశ్వర స్వామి ఆలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కడపకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ అబ్దుల్ హసన్ (35), చిలమకూరుకు చెందిన ఎ.ప్రతాప్‌రెడ్డి (58) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి వీఎన్ పల్లె మండలం పాలగిరికి చెందిన దాసరి రవి ఇంటి నిర్మాణం కోసం కడపలో గ్రిల్స్ కొనుగోలు చేశాడు. వాటిని ఆటోలో ఎర్రగుంట్లకు తీసుకు వెళ్తున్న క్రమంలో మండలంలోని పందిళ్లపల్లె భైరవేశ్వర స్వామి ఆలయం వద్దకు రాగానే ఎర్రగుంట్ల నుంచి కడప వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీ కొంది. ఈ ఘటనలో ఆటో నుజ్జు నుజ్జు అయింది. అలాగే ఆటో డ్రైవర్ హసన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న దాసరి రవి, ప్రతాప్‌రెడ్డితో పాటు కారు డ్రైవర్ ఇంతియాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలించారు. చిలమకూరుకు చెందిన ప్రతాప్‌రెడ్డి ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే దాసరి రవిని కమలాపురం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కారు డ్రైవర్ ఇంతియాజ్‌ను రిమ్స్‌కు తరలించారు. కాగా ప్రతాప్‌రెడ్డి ఎర్రగుంట్లలో మెడికల్ స్టోర్ నిర్వహిస్తూ జీవనం గడుపుతున్నాడు. కడపకు చెందిన హసన్ ఆటో బాడుగకు తెచ్చుకుని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదానికి గురైన ఆటో



ఘటనా స్థలంలోనే మృతి చెందిన హసన్



మృతి చెందిన ప్రతాప్‌రెడ్డి (ఫైల్)



చికిత్స పొందుతున్న దాసరి రవి

వల్లూరు సమీపంలో..

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిపై మండల పరిధిలోని ఈత చెట్టు బస్టాపు సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జ్వరమోల్ల బాబు (45) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు మండల పరిధిలోని పాపాఘ్ని నగర్‌కు చెందిన జ్వరమోల్ల బాబు ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తుండగా ఈత చెట్టు బస్ స్టాప్ సమీపంలో ఎర్రగుంట్ల వైపు నుంచి కడప వైపు ప్రయాణిస్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న బాబు తీవ్రంగా గాయపడి తీవ్ర రక్త స్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు.



బాబు మృతదేహం

పోరుమామిళ్ల మండలంలో..

పోరుమామిళ్ల (అట్లూరు) : పోరుమామిళ్ల మండలంలోని ఈదుళ్లపల్లె గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్కినేని ఓబన్న (80) మృతిచెందాడు. ఎస్ఐ ఆర్.వి.కొండారెడ్డి తెలిపిన వివరాల మేరకు కొమరోలు నుంచి పోరుమామిళ్ల వైపు వస్తున్న ఏపీ39 యూజె 7481 నంబరు గల బొలెరో పికప్ వాహనం డ్రైవర్ ఇసుకల కిరణ్‌కుమార్ వేగంగా వస్తూ ఈదుళ్లపల్లె గ్రామానికి చెందిన లక్కినేని ఓబన్నను వెనుకవైపు నుంచి ఢీకొన్నాడు. ఓబన్న ఎగిరి రోడ్డుపై పడగా అతని తల, చెవి, కుడి చేయి, కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడపకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఓబన్న మనవడు లక్కినేని కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్లు ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-14, అండర్-17 బాలబాలికల జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో మంగళవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు పతకాలు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా అండర్-14, అండర్-17 బాలబాలికల జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు ప్రవీణ్‌కిరణ్, రెడ్డయ్య, ఇజ్రాయిల్, వసంత్, అగ్గిరప్ప, విశ్వనాథ్, సువర్ణ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్లు..

అండర్-14 బాలికలు : కె.రేణుశ్రీ, ఎ.పవనశ్రీ, చంద్రమౌనిక, సింధు, అమృతవర్షిణి, వినూత్న, సంకీర్తన, భార్గవి, శివచైతన్య, నవీన, శ్రావణి, ముస్కాన్.

అండర్-17 బాలికలు : అర్చనచంద్రిక, నందిని, ఆఫ్రీన్, సమీర, శ్రీలత, వీణామాధురి, లావణ్య, నాగమణి, శ్రాగ ఓలీవియా, ఎన్. వెంకటమౌనిక, ఆయేషాబేగం

అండర్-14 బాలురు : చరణ్, వెంకటశ్రీనాథ్, నాగచైతన్య, వెంకటనారాయణ, భరద్వాజ్‌రెడ్డి, శ్రీకేశవ, గౌతమ్, శశికిరణ్, హేమవెంకటతరుణ్, గౌతమ్, మహేష్, మహమ్మద్ హుస్సేన్.

అండర్-17 బాలురు : చంద్రకుమార్, శ్రీకళాయాదవ్, మాధవదత్తుడు, నయూమన్, మనోజ్‌కుమార్, మహమ్మద్, రామ్‌కుమార్, జగదీప్‌శుభంకర్, ఓబయ్య, అరుణ్‌కుమార్‌రెడ్డి, నరసింహులు, గౌరీశంకర్.

జిల్లా దేవదాయశాఖలో బదిలీలు

కడప కల్చరల్ : జిల్లా దేవదాయ శాఖలో బదిలీలు జరిగాయి. మంగళవారం ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని పలువురు ఈఓలకు స్థాన చలనం కలిగింది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రొద్దుటూరు కృష్ణ గీతాశ్రమం ఈఓ సి.శంకర్ బాలాజీని బి.మఠం ఆలయానికి బదిలీ చేశారు. అలాగే పక్కీరుపల్లె రామస్వామి ఆలయం ఈఓ రవిశేఖర్‌రెడ్డిని సీకే దిన్నె గంగమ్మ ఆలయానికి, ప్రొద్దుటూరు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ కె.రామచంద్రాచార్యులును అదే ప్రాంతంలోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయం, గీతాశ్రమం, శ్రీరంగయ్య సత్రం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్‌కు బదిలీ చేశారు. వేంపల్లెలోని శ్రీ వృషభాచలేశ్వరస్వామి ఆలయంలో పనిచేస్తున్న కె.శ్రీనివాసులును లక్కిరెడ్డిపల్లె శ్రీ గంగమ్మ తల్లి ఆలయానికి బదిలీ చేశారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్‌ను ప్రొద్దుటూరు గ్రూప్-1 టెంపుల్స్(ఆంజనేయ స్వామి ఆలయం, సుంకువెంకట సుబ్బయ్య సత్రం, శ్రీ రామేశ్వర దేవస్థానం, ఇతర గ్రూప్ టెంపుల్స్) ఈఓగా బదిలీ చేశారు. పులివెందుల గ్రూప్ టెంపుల్స్‌లో పనిచేస్తున్న కేవీ రమణను ప్రొద్దుటూరు వెల్లాల సంజీవరాయస్వామి ఆలయం, శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం, ఇతర గ్రూప్ టెంపుల్స్‌కు బదిలీ చేశారు. పోరుమామిళ్ల గ్రూప్ టెంపుల్స్ ఈఓగా పనిచేస్తున్న జి.వెంకటసుబ్బయ్యను నంద్యాల ఎం.కృష్ణాపురం గ్రూప్ టెంపుల్స్‌కు బదిలీ చేశారు. సీకే దిన్నె గంగమ్మ ఆలయం ఈఓగా పనిచేస్తున్న పి.సురేష్‌కుమార్ రెడ్డిని కడప నగరం పక్కీరుపల్లెలోని శ్రీ రామస్వామి ఆలయానికి బదిలీ చేశారు. రాయచోటి శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో పనిచేస్తున్న డీవీ రమణారెడ్డిని పులివెందుల గ్రూప్స్ టెంపుల్స్ ఈఓగా బదిలీ చేశారు. లక్కిరెడ్డిపల్లె అనంతపురం గంగమ్మ ఆలయ ఈఓగా పనిచేస్తున్న ఎం.మారుతిప్రసాద్‌ను చాపాడు మండలం అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి బదిలీ చేశారు. టి.సుండుపల్లె ఈఓ జి.కొండారెడ్డిని ఎర్రగుంట్ల గ్రూప్ ఆఫ్ టెంపుల్స్‌కు, ఎర్రగుంట్ల గ్రూప్ టెంపుల్స్ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డిని టి.సుండుపల్లె గ్రూప్స్ టెంపుల్స్‌కు బదిలీ చేశారు.

ఏపీఎస్‌పీడీసీఎల్‌లో..

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌లో పనిచేస్తున్న పలువురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను బదిలీ చేస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. కడప సీఓలో కమర్షియల్ డీఈఈగా ఉన్న కె. రమేష్ రెడ్డిని కన్‌స్ట్రక్షన్ డీఈఈగా బదిలీ చేశారు. వేంపల్లి డీఈఈగా ఉన్న డి. గురుమోహన్‌రెడ్డిని పులివెందులకు, కడప రూరల్స్-1 డీఈఈగా ఉన్న కె. క్రిష్ణదేవను ఎస్‌పీడీఐకి, పులివెందుల డీఈఈగా ఉన్న జె. శ్రీకాంత్‌ను ఆలూరుకు బదిలీ చేశారు. అలాగే కడప టౌన్-1 డీఈఈగా ఉన్న ఎం. నాగమునిస్వామిని కడప రూరల్స్-1కు బదిలీ చేశారు. మైదుకూరు డీఈఈగా ఉన్న ఎంఆర్ శ్రీనివాసులరెడ్డిని ప్రొద్దుటూరుకు, కడప ఎస్‌పీడీఐలో ఉన్న జి. నాగేశ్వరరెడ్డిని కడప టౌన్-1కు, కర్నూల్ హెచ్‌టీఎంఎస్‌డీలో డీఈఈగా ఉన్న వీవీ మోహన్ కుమార్‌ను కడప సీఓలో కమర్షియల్ విభాగానికి డీఈఈగా, ప్రొద్దుటూరు డీఈఈగా ఉన్న వీజీ శ్రీనివాసులరెడ్డిని మైదుకూరుకు, పోరుమామిళ్ల డీఈఈగా ఉన్న బి. చిన్నస్వామి నాయక్‌ను గూడూరు రూరల్స్‌కు బదిలీ చేశారు.

నగరపాలక సంస్థలో..

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో పలువురు డీఈఈలు బదిలీ అయ్యారు. ఈ మేరకు పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆర్. గోపాలక్రిష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పి. కరిముల్లా ఖాన్‌ను పులివెందుల పబ్లిక్ హెల్త్ సబ్ డివిజన్‌కు బదిలీ చేశారు. నంద్యాల డీపీహెచ్‌ఈఓలో డీఈఈగా ఉన్న ఎస్. కావ్యను కడప అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ(కుడా)కు బదిలీ చేశారు. కడప పబ్లిక్ హెల్త్ సబ్ డివిజన్ డీఈఈగా ఉన్న జె. యశోదను ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి, నంద్యాల మున్సిపాలిటీలో డీఈఈగా ఉన్న కె. జయభారత్‌రెడ్డిని కుడాకు , పులివెందుల పబ్లిక్ హెల్త్ సబ్ డివిజన్‌లో డీఈఈగా ఉన్న జి. సురేంద్రబాబును జమ్మలమడుగు మున్సిపాలిటీకి, కడప కార్పొరేషన్‌లో డీఈఈగా ఉన్న ఎం. రాజేష్‌ను అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న జి.చంద్రశేఖర్‌ను కడప మున్సిపల్ కార్పొరేషన్‌కు, ప్రొద్దుటూరులో పనిచేస్తున్న జి. వెంకటరమణను చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు, జమ్మలమడుగు మున్సిపాలిటీ నుంచి ఎస్. బాలమల్లేశ్వర్‌ను కడప మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు.

మున్సిపల్ ఏఈల బదిలీలు

కడప కార్పొరేషన్ : జిల్లాలో వివిధ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఎంఏఈఈ), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్(ఎంఏఈ), అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ)లను బదిలీ చేస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ ఆర్. రాజగోపాల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఎంఏఈ ఎస్. దిల్షాద్‌ను ప్రొద్దుటూరుకు బదిలీ చేసి పుంగనూరులో పనిచేస్తున్న బి. క్రిష్ణకుమార్‌ను కడపకు బదిలీ చేశారు. తిరుపతిలో ఎంఏఈగా ఉన్న ఎం. నరేంద్రకుమార్‌ను రాజంపేట మున్సిపాలిటీకి బదిలీ చేశారు. ప్రొద్దుటూరు ఎంఏఈగా ఉన్న కె. ఉమామహేశ్వరిని జమ్మలమడుగు మున్సిపాలిటీకి, ఆళ్లగడ్డ ఏఈగా ఉన్న కె. సురేంద్రనాథ్‌రెడ్డిని ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి, రాజంపేట ఎంఏఈగా ఉన్న ఎం. శిల్పను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. పులివెందుల మున్సిపాలిటీలో ఏఈగా ఉన్న పి. లోకేశ్వర్ రెడ్డిని కడప మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. కడపలో ఎంఏఈగా పనిచేస్తున్న ఎన్. నిరుపను పులివెందుల మున్సిపాలిటీకి, కడప కార్పొరేషన్‌లో ఎంఏఈగా ఉన్న కె. విశ్వకిరిటీని రాయచోటి మున్సిపాలిటీకి బదిలీ చేశారు.

నగలు చోరీ జరిగినా పోలీసులు పట్టించుకోలేదు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా బాధితుడి ఫిర్యాదు

కడప అర్బన్ : ప్రొద్దుటూరు టౌన్ శ్రీనివాసనగర్ వీధిలో నివాసం ఉంటున్న షేక్ ఇబ్రహీం కుమారుడు షేక్ జిలానీ బాషా, తన భార్య, కుటుంబ సభ్యులతో మంగళవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఈ ఫిర్యాదును జిల్లా ఎస్పీ వి. హర్షవర్దన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు స్వీకరించారు. తగిన చర్యలు తీసుకోవాలని ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసులను ఆదేశించారు. ఈ సందర్భంగా బాధితుడు జిలానీ బాషా విలేకరులతో మాట్లాడారు. తాను గత 30 సంవత్సరాలుగా ప్రొద్దుటూరు టౌన్‌లోని పార్వతి ఆర్కేడ్ కాంప్లెక్స్. శేషుగారి వీధిలోని గ్రౌండ్‌ఫ్లోర్ రూం నంబర్ 3లో బంగారు పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నానన్నారు. ఈ ఆర్కేడ్‌లో నాలుగు రూములున్నాయన్నారు. సీసీ కెమెరాలు పనిచేయడం లేదన్నారు. ఈ ఆర్కేడ్‌లోకి వచ్చే దారిలో సీసీ కెమెరాలు మాత్రం పనిచేస్తున్నాయన్నారు. ఆగస్టు 25వ తేదీన రాత్రి 7:50 గంటల సమయంలో తన స్నేహితుడు వై.జయశంకర్‌తో కలిసి టిఫిన్‌ను పార్సిల్ కట్టించుకుని తిరిగి వచ్చానన్నారు. 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలోనే తాను అంగడిలో పొట్లాలలో దాచి ఉంచిన దాదాపు 309 గ్రాముల బంగారు ఆభరణాలు పూలహారం (107 గ్రాములు), నల్లల దండ (30 గ్రాములు), మినీ హారం (20 గ్రాములు), రెండు పొరల భారత్ చైన్ (45 గ్రాములు), ప్యూర్ బంగారం (50 గ్రాములు), లేడీస్ బ్రాస్‌లెట్ (7 గ్రాములు) చైన్ (8 గ్రాములు), కుదువపెట్టుకున్న వస్తువులు (12గ్రాములు), చిల్లర బంగారు (30 గ్రాములు) దొంగిలించారన్నారు. ఈ పని స్వర్ణకారునికి తప్ప ఎవరికీ సాధ్యంకాదన్నారు. ఈ సంఘటనపై ప్రొద్దుటూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి కేసు నమోదు చేయకపోగా తననే సీఐ యుగంధర్ తప్పులు పడుతున్నారని వాపోయారు. కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయమని ఎన్నిసార్లు బతిమలాడినా ప్రయోజనం లేదన్నారు. ఈ చోరీపై పోలీసు ఉన్నతాధికారులు విచారించి తమ బంగారు ఆభరణాలను దొంగిలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరాడు.



విలేకరులతో మాట్లాడుతున్న బాధితుడు షేక్ జిలానీ బాషా, కుటుంబ సభ్యులు

15 మంది తహసీల్దార్ల బదిలీ

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో 15 మందిని తహసీల్దార్లను వివిధ మండలాలకు బదిలీ చేస్తూ కలెక్టర్ శివ శంకర్ లోతేటి మంగళవారం ప్రొసీడింగ్స్ జారీ చేశారు. అలాగే భారీగా 59 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 25 మంది రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేశారు. జిల్లాలో పనిచేస్తున్న 83 మంది సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు.

బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలు

తహసీల్దార్ పేరు	ప్రస్తుతం పనిచేస్తున్నది	బదిలీ అయినది
సి.గురప్ప	సింహాద్రిపురం	కొండాపురం
కె.మాధవకృష్ణారెడ్డి	కొండాపురం	కలెక్టరేట్
జీవీ నాగేశ్వరరావు	కలెక్టరేట్	సింహాద్రిపురం
యు.దస్తగిరయ్య	--	జమ్మలమడుగు ఆర్డీఓ ఆఫీసు
పి.రమాకుమారి	ముద్దనూరు	చాపాడు
టి.సరస్వతి	ఖాజీపేట	ముద్దనూరు
డి.మహబూబ్‌బాషా	కలసపాడు	ఖాజీపేట
జి.రవీంద్రారెడ్డి	చాపాడు	కలసపాడు
ఎం.బాలనరసింహులు	కాశినాయన	పెద్దముడియం
వి.వెంకట సుబ్బయ్య	పెద్దముడియం	కాశినాయన
జీవీ మధురవాణి	దువ్వూరు	బద్వేలు ఆర్డీఓ ఆఫీసు
జి.అక్బల్‌బాషా	బద్వేలు	దువ్వూరు
పీఎండీ అలీఖాన్	బి.కోడూరు	కడప అర్బన్
పి.సుబ్బలక్షుమ్మ	--	అట్లూరు
డి.రామకిశోర్	డీటీ బి.కోడూరు	ఎఫ్ఏసీ బి.కోడూరు

వైఎస్ జగన్‌ను హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించేందుకు కుట్ర

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి



కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించేందుకు సీఎం చంద్రబాబు కుట్ర చేస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర నేత రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ఆరోపించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌ను హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించి, తద్వారా రాజకీయంగా అంతం చేసేందుకు బాబు విఫలయత్నం చేస్తున్నారన్నారు. 2019 ఎన్నికల సమయంలో 3648 కి.మీల ప్రజా సంకల్పయాత్ర ముగించుకొని బొబ్బలెక్కిన పాదాలతో పాదరక్షలు సైతం లేకుండా కాలినడకన కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న వైఎస్ జగన్ హిందూ వ్యతిరేకి ఎలా అవుతారని ప్రశ్నించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని చంద్రబాబు తిరుపతి వెంకన్న గుడిలో ప్రోక్షణ చేయించారని, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేస్తూ విచారణ అధికారులను ప్రభావితం చేస్తున్నారన్నారు. వారి స్థాయికి తక్కువగా ఉన్న అధికారులతో సిట్ వేసి విచారణ చేస్తే వాస్తవాలు ఎలా వెలుగులోకి వస్తాయని ప్రశ్నించారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తాను తప్పు చేసి ఉంటే తన కుటుంబాన్ని సర్వనాశనం చేయాలని తిరుమలలో ప్రమాణం చేయడం, సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని మరో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించడం వైఎస్సార్‌సీపీ చిత్తశుద్ధికి నిదర్శనాలన్నారు.

వరద బాధితులకు వేదాస్ విద్యా సంస్థల వితరణ



కడప సెవెన్‌రోడ్స్ : విజయవాడ వరద బాధితులకు జిల్లాలోని వల్లూరు, కమలాపురానికి చెందిన వేదాస్ విద్యా సంస్థలు సంయుక్తంగా విరాళాలు సేకరించి రూ. 3.50 లక్షలు మంగళవారం కలెక్టర్ శివశంకర్‌కు అందజేశారు. కళాశాల వైస్ చైర్మన్ ఎం.దిలీప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ఆర్‌డీ ధర్మద్విరాజ్, హెచ్ఎం వసుంధరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కడపకు చెందిన నాగార్జున మోడల్ స్కూలు యాజమాన్యం, విద్యార్థులు కలెక్టర్ శివశంకర్‌ను కలిసి వరద బాధితుల సహాయార్థం రూ. 1.20 లక్షల చెక్కును అందజేశారు.

తిరుమలలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుపతి క్రైమ్ : తిరుమల అశ్విని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి ఈనెల 19వ తేదీన మృతి చెందాడు. తిరుమల వన్ టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. తిరుమలలోని రాంబగీచా సమీపంలోని వినాయకుడి గుడి వద్ద ఓ వ్యక్తి కిందపడి ఉండగా గమనించి ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ వ్యక్తి అప్పటికే బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లుగా అశ్విని ఆస్పత్రిలో వైద్యులు నిర్ధారించారు. అతని వద్ద ఉన్న ఆధారాల మేరకు అతని పేరు దూదేకుల సిద్దయ్య అని గుర్తించారు. వైఎస్సార్ జిల్లాలోని బ్రహ్మంగారి మఠం అతని సొంత ఊరని గుర్తించి అక్కడికి వెళ్లి విచారించారు. అయితే ఆ ఊరిలో అతనికి చెందిన వారు ఎవరూ లేరు. అతని వివరాలు తెలిసిన వారు తిరుమల వన్ టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ విజయ్‌కుమార్ కోరారు.

ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపికల షెడ్యూలు విడుదల

కడప స్పోర్ట్స్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రీడా ఎంపికలకు సంబంధించిన షెడ్యూలును, వేదికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రకటించారు. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే క్రీడా ఎంపికలకు సంబంధించిన షెడ్యూలు విడుదల చేశారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో ఎంపికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.

తేదీ	క్రీడాంశం	వేదిక
25-09-24	కరాటే	నూనెవారిపల్లె, రాజంపేట
26-09-24	హ్యాండ్‌బాల్	డీఎస్ఏ మైదానం, కడప
26-09-24	తైక్వాండో	డీఎస్ఏ మైదానం, కడప
26-09-24	ఆర్చరీ	వైఎస్ఆర్ స్పోర్ట్స్‌స్కూల్, కడప
26-0-24	ఫెన్సింగ్	జార్జిక్లబ్, ప్రొద్దుటూరు
27-09-24	రైఫిల్ షూటింగ్	జార్జిక్లబ్, ప్రొద్దుటూరు
27-09-24	సెపక్‌తక్రా	డీఎస్ఏ మైదానం, కడప
28-09-24	అథ్లెటిక్స్	వైఎస్ఆర్ క్రీడాపాఠశాల, కడప
28-09-24	జిమ్నాస్టిక్స్	వైఎస్ఆర్ క్రీడాపాఠశాల, కడప
28-09-24	మోడ్రన్ పెంటాథ్లన్	మేధా డిఫెన్స్ అకాడమీ, మైదుకూరు
28-09-24	మల్ల కంబ	మేధా డిఫెన్స్ అకాడమీ, మైదుకూరు
30-09-24	సాఫ్ట్‌బాల్	జెడ్పీహెచ్ఎస్, మాసాపేట, రాయచోటి
30-09-24	బేస్‌బాల్	జెడ్పీహెచ్ఎస్, మాసాపేట, రాయచోటి

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవం

- 9 ఏళ్ల క్రితం మైదుకూరులో హత్యకు గురైన హోటల్ యజమాని వెంకటసుబ్బయ్య
- కొడుకు, కోడలు, కోడలి తమ్ముడే ముద్దాయిలు
- హత్య కేసులో తీర్పు వెల్లడించిన ప్రొద్దుటూరు సెకండ్ ఏడీజే కోర్టు

ప్రొద్దుటూరు క్రైం : ఆస్తి కోసం, వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో తండ్రిని కొడుకు, కోడలు, మరొక వ్యక్తి దారుణంగా హత్య చేశారు. తొమ్మిదేళ్ల క్రితం మైదుకూరు పరిధిలో జరిగిన కడప లక్ష్మీభవన్ హోటల్ యజమాని ముద్దంశెట్టి వెంకటసుబ్బయ్య (63) హత్య కేసులో ప్రొద్దుటూరు సెకండ్ ఏడీజే కోర్టు ముద్దాయిలైన ముద్దంశెట్టి శివప్రసాద్, మైలారం జగన్నాథ్, సుప్రజలకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. పోలీసు అధికారులు తెలిపిన మేరకు కేసు పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. ముద్దంశెట్టి వెంకటసుబ్బయ్య కడపలో లక్ష్మీభవన్ హోటల్‌ను నిర్వహించేవాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు నాగరాజుకు సుప్రజతో వివాహం అయింది. కొంత కాలం తర్వాత నాగరాజు ఇంటి సమస్యల కారణంగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో వెంకటసుబ్బయ్య హోటల్ నిర్వహణ బాధ్యతలను కోడలైన సుప్రజకు అప్పగించాడు. ఈ క్రమంలో సుప్రజ హోటల్‌లో పని చేస్తున్న ఒక వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఆమెను వెంకటసుబ్బయ్య మందలించాడు. సుప్రజ, ఆమె ఇరువురి కుమార్తెలను హైదరాబాద్‌లో ఉంటున్న తన చిన్న కుమారుడు శివప్రసాద్ వద్దకు పంపించాడు. అయితే కొన్ని రోజుల తర్వాత మరిది అయిన శివప్రసాద్‌తో కూడా సుప్రజ వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలుసుకొని హైదరాబాద్‌లోనే కోచింగ్ తీసుకుంటున్న వెంకటసుబ్బయ్య కుమార్తె రాజేశ్వరి వారిని మందలించింది. కొన్ని రోజుల తర్వాత సుప్రజ తన ఆస్తి వాటా పంచి ఇవ్వాలని మామను అడుగగా అందుకు ఆయన నిరాకరించి తన 6 ఎకరాల పొలాన్ని సుప్రజ ఇద్దరు పిల్లలకు పంచుతానని చెప్పాడు. దీంతో శివప్రసాద్, సుప్రజతో పాటు ఆమె సోదరుడు జగన్నాథ్‌లు కలిసి వెంకటసుబ్బయ్యను ఎలాగైనా చంపాలని పథకం పన్నారు. ఈ క్రమంలో 2014 డిసెంబర్ 30న సాయంత్రం మైదుకూరు సమీపంలో ఉన్న ముదిరెడ్డిపల్లె పొలాల్లోని తన గెస్ట్‌హౌస్‌లో వెంకటసుబ్బయ్య ఉండగా ముగ్గురు కలిసి వేటకొడవళ్లతో దారుణంగా నరికి చంపారు. తోటమాలి మహేష్ ఫిర్యాదు మేరకు అదే రోజు అప్పటి మైదుకూరు అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు 387/2014 క్రైం నంబర్ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ ప్రొద్దుటూరులోని సెకండ్ ఏడీజే కోర్టులో కొనసాగుతూ వస్తోంది. తుది విచారణ మంగళవారం జరిగింది. ఈ క్రమంలో నేరం రుజువు కావడంతో ముద్దాయిలైన ముద్దంశెట్టి శివప్రసాద్, మైలారం జగన్నాథ్, ముద్దంశెట్టి సుప్రజలకు యావజ్జీవ కారాగారశిక్షతో పాటు రూ. 4 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ సెకండ్ ఏడీజే కోర్టు జడ్జి జీఎస్ రమేష్ కుమార్ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పీపీ బి.రాంప్రసాద్‌రెడ్డి బలమైన వాదనలతో ముద్దాయిలకు శిక్ష పడేలా కృషి చేశారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువు చేసి, శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు అభినందించారు.



హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడిన ముద్దాయిలు శివప్రసాద్, జగన్నాథ్